యాదగిరిగుట్టలో వైకుంఠనాథుడిగా దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు. ఇన్‌సెట్‌లో స్వామివారు

ముక్కోటి.. భక్తజన కోటి

గోవిందా.. గోవిందా.. అంటూ భక్తుల విష్ణు నామస్మరణతో ఆలయాలు మార్మోగిపోయాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు వైష్ణవాలయాలకు బారులుతీరారు. ఉత్తర ద్వారం నుంచి ప్రవేశించి స్వామివారిని దర్శించుకొని తరించారు. రాష్ట్రంలోని ప్రధానాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అర్చకులు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించారు. తిరుమలతోపాటు రాష్ట్రంలోని భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి, యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహస్వామి, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజన్న ఆలయం, జగిత్యాల జిల్లా ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి ఆలయాలతోపాటు రాష్ట్రంలోని అన్ని క్షేత్రాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కనిపించింది.

15వేల కుటుంబాలు పస్తులు

- జీతాలు లేక అవస్థలు పడుతున్న వీఆర్‌ఏలు
- ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా 'ఐడీ' లేక కష్టాలు
- సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నపం

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఒక్క నెల జీతం రాకపోతేనే కుటుంబం ఆగమాగం అవుతుంది.. కానీ వీఆర్‌ఏలకు ఐదు నెలలుగా వేతనాలు లేవు. దీంతో దాదాపు 15వేల కుటుంబాలు ఐదు నెలలుగా పస్తులు ఉంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందా? అంటే వచ్చింది.. కానీ రాలేదు అన్నట్టు.. వారి పరిస్థితి 'త్రిశంకు స్వర్గం'లో ఊగిసలాడుతున్నది. రెవెన్యూ శాఖలోని వీఆర్‌ఏ వ్యవస్థను గత ప్రభుత్వం ఈ ఏడాది జూలైలో రద్దు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20,555 మంది వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తూ జూలై 24న ఉత్తర్వులు విడుదల చేసింది. వీరిలో దాదాపు 15వేల మంది ఆగస్టులో విధుల్లో చేరారు. రెవెన్యూ శాఖకు చెందిన 30 మంది ఆఫీస్ సబార్డినేట్‌లు (ఓఎస్) వీఆర్‌ఏల క్రమబద్ధీకరణను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ముందుగా తమకు పదోన్నతులు కల్పించిన తర్వాతే వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని కోరారు. దీంతో న్యాయస్థానం ఆగస్టు 10న స్టే విధించింది. అప్పటి నుంచి వారికి వేతనాలు దక్కని పరిస్థితి. అయితే 30 మంది ఓఎస్‌లు తమ పిటిషన్‌ను వెనక్కి తీసుకొనేందుకు ఒప్పుకున్నారు. ఈ మేరకు న్యాయస్థానానికి తెలియజేశారు. దీంతో న్యాయస్థానం నవంబర్ మూడో వారంలో కేసును మూసివేసింది. వారికి ప్రభుత్వ ఉద్యోగులుగా ఐడీలు ఇచ్చి వేతనాలు అందించేందుకు అడ్డంకులన్నీ తొలిగిపోయాయి అనుకుంటుండగా.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

శుభవార్తతో కొత్త ఏడాదిలోకి..

కోడ్ ఎత్తేసిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ఇప్పటికే వీఆర్‌ఏలు సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ పరిస్థితిని వివరించారు. సమస్యను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ తదితరులకు సైతం తమ పరిస్థితిని వివరించారు. 2023లో తమకు ప్రభుత్వ ఉద్యోగులుగా అవకాశం వచ్చిందని, అయినా ఐదు నెలలుగా పస్తులుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు ఐడీలు ఇచ్చి, వేతనాలు అందించి, శుభవార్తతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభించేలా చూడాలని కోరుతున్నారు.

బస్సులో కండక్టర్ చేతివాటం

- మహిళలు ఎక్కకపోయినా టికెట్లు జారీ
- స్టేజీకి 10 నుంచి 20 వరకు టికెట్లు..
- స్టేజీ దాటగానే చించివేసిన వైనం

మహబూబ్‌నగర్-తాండూరు బస్సులో మహిళలకు టికెట్లు జారీ చేస్తున్న కండక్టర్

కోస్గి, డిసెంబర్ 23 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. దీంతో బస్టాండ్లు, బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. కానీ సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో మాత్రం బస్సు కండక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మహబూబ్‌నగర్-తాండూర్ మధ్య తిరుగుతున్న ఆర్టీసీ బస్సులో కండక్టర్ చేతివాటం ప్రదర్శిస్తున్న దృశ్యాలను శనివారం ఓ ప్రయాణికుడు చిత్రీకరించారు. మహబూబ్‌నగర్ నుంచి తాండూర్ వెళ్తున్న బస్సు (టీఎస్ 34 టీఏ 5189)లో ఉన్న కండక్టర్ సీటులో దర్జాగా కూర్చోని ప్రతి స్టేజీ వద్ద మహిళా ప్రయాణికులు బస్సు ఎక్కకపోయినా 10 నుంచి 20 టికెట్లు ఇష్యూ చేశాడు. గండీడ్, జానంపల్లి ఇలా రెండు స్టేజీల వద్ద బస్సులో మహిళా ప్రయాణికులు తక్కువగా ఉండటంతో టిమ్ నుంచి టికెట్లు మాత్రం ప్రింట్ ఇచ్చాడు. తర్వాత వాటిని చించి బయట పడేశాడు. బస్సులో సగం కంటే ఎక్కువ సీట్లు ఖాళీ ఉన్నా టికెట్లు మాత్రం జారీ చేస్తూ మహిళలు ప్రయాణిస్తున్నట్టు లెక్కలు చూపిస్తున్నట్టు తెలుస్తున్నది. కండక్టర్ తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎలక్ట్రిక్ బస్సులపై ఆర్టీసీ పీచేముడ్

- అద్దె, డీజిల్ బస్సుల వైపు పయనం
- 'మహాలక్ష్మి' రద్దీతో అత్యవసర నిర్ణయం

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంతో పర్యావరణహితంగా సంస్థను నడపాలని భావించిన యాజమాన్యం ఇప్పుడు పీచేముడ్ అంటున్నది. మహాలక్ష్మి పథకం అమలుతో అదనపు బస్సులు కావాల్సిన ఆర్టీసీ.. అద్దె ప్రాతిపదికన 200 డీజిల్ బస్సులను దించాలని నిర్ణయించింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించింది. ఇదే అదనుగా అద్దె బస్సుల యజమానులు రేటు పెంచే యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. ఆర్టీసీలో ఎలక్ట్రికల్ బస్సుల సంఖ్యను పెంచాలని యాజమాన్యం ప్రణాళిక రూపొందించింది. మార్చి నాటికి 1300 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించి.. గ్రేటర్ హైదరాబాద్‌లోనే 54 వరకు తిప్పాలని ప్రణాళిక రూపొందించింది. ఇప్పటివరకు 25 బస్సులు రోడ్డెక్కాయి. అనూహ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయణాన్ని కల్పించడంతో ఆక్యుపెన్సీ భారీగా పెరిగింది. దీంతో ప్రయాణికుల అవసరాలు తీర్చేందుకు బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఏర్పడింది.

డీజిల్ బస్సులే శరణ్యం

రోడ్లపైకి ఎలక్ట్రికల్ బస్సులు వస్తాయనుకుంటున్న తరుణంలో డీజిల్ బస్సులనే తీసుకురావాల్సిన అత్యవసర పరిస్థితి టీఎస్‌ఆర్టీసీకి ఏర్పడింది. కొత్త ప్రభుత్వం ఇప్పటికిప్పుడు 1300 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో అద్దెకు వచ్చే డీజిల్ బస్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. సంక్రాంతి లోగా 200 డీజిల్ అద్దె బస్సులను దించేందుకు టెండర్లను ఆహ్వానించారు. ముందుచూపు, సరైన ప్రణాళిక లేని సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణహితాన్ని గాలికి వదిలేశాయని పర్యావరణవేత్తలు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో కార్యాలయంలో ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది సీవీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ సీపీగా తన అనుభవాలను సీవీ ఆనంద్ ట్విట్టర్(ఎక్స్)లో గుర్తు చేసుకున్నారు. రెండేండ్ల పాటు హైదరాబాద్ సీపీగా పని చేయడం ఎంతో సంతృప్తిగా ఉందని, ఇప్పుడు గతంలో ఎప్పుడూ పనిచేయని బాధ్యతల్లోకి వచ్చానని పేర్కొన్నారు. శాంతిభద్రతలను ఎంతో పటిష్టంగా అమలు చేశానని, దీనికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సుమారు మూడు దశాబ్దాల తర్వాత హైదరాబాద్ పరిధిలో 31 కొత్త ఠాణాలు, 12 డివిజన్లు, 3 ట్రాఫిక్ జోన్లు ఏర్పాటు చేశామని వివరించారు.

గంగాప్రసాద్‌కు అరుదైన గౌరవం

హైదరాబాద్, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): నిజామాబాద్‌కు చెందిన డాక్టర్ మల్లెగోడ గంగాప్రసాద్‌కు ఆలిండియా రేడియో నుంచి అరుదైన గౌరవం లభించింది. జనవరి 5న జార్ఖండ్ రాజధాని రాంచీలో నిర్వహించే 'ఆకాశవాణి సర్వభాష జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం అందింది. అందులో తెలుగు భాష కవిగా తన కవిత్వాన్ని చదవాలని ఆలిండియా రేడియో కోరింది. గంగాప్రసాద్‌కు అవకాశం రావడంపై ఆలిండియా రేడియో హైదరాబాద్ స్టేషన్ డైరెక్టర్ ఉదయశంకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్, సుప్రసిద్ధ కవి నందిని సిధారెడ్డితోపాటు ఆకాశవాణిలో ఉద్యోగ విరమణ చేసిన అధికారులు తదితరులు అభినందించారు.

మేడారం జాతరలోనే సమ్మేళనం

- సర్కారు తాజా నిర్ణయంతో గిరిజనశాఖ కసరత్తు
- ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరిగే మేడారం మహాజాతర సమయంలోనే కోయ ఇలవేల్పుల సమ్మేళనం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ కసరత్తు చేస్తున్నది. మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాతరకు రెండు నెలల ముందే అధికారులు 2018 నుంచి 2022 వరకు కోయ ఇలవేల్పుల సమ్మేళనం నిర్వహిస్తూ వచ్చారు. ఈసారి అలా కాకుండా జాతర సమయంలోనే సమ్మేళనం నిర్వహిస్తే గిరిజన సాంస్కృతిక వైభవం ఇతర భక్తులకు తెలిసే అవకాశం ఉంటుందని స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఇటీవలి సమీక్షలో అధికారులకు సూచించారు. దాంతో గిరిజన సంక్షేమశాఖ ఏర్పాట్లకు కసరత్తు చేస్తున్నది.

గిరిజన సమ్మేళనంలో 20 ఇలవేల్పుల ప్రదర్శన

మేడారంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సమ్మక్క-సారలమ్మ మ్యూజియంలో కోయల ఇలవేల్పుల సమ్మేళనం నిర్వహించేవారు. కోయ ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఇలవేల్పుల (ఇంటిదైవాలు) ప్రదర్శన, మొక్కులు, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా సమ్మేళనం నిర్వహించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఉన్న కోయ గిరిజనుల్లో ఇప్పటి వరకు 150 ఇలవేల్పులు ఉంటాయని అంచనా. ఇప్పటి వరకు కోయ గిరిజన సమ్మేళనంలో 20 కంటే ఎక్కువ ఇలవేల్పుల ప్రదర్శన జరగలేదు. ఆదివాసీ కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు ఉట్టిపడేలా నిర్వహించే ఈ సమ్మేళనంలో పాల్గొనాలంటే ముందుగా ఆయా కోయగూడెల్లో ఉన్న ఇలవేల్పుల కొలుపులకు సంబంధించి కట్టుబాట్లను నిష్ఠతో అనుసరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మిగితా వాళ్లు తమ ఇలవేల్పులను పొలిమేరలు దాటించరని, ఈ కారణంగా ఎక్కువ ఇలవేల్పుల ప్రదర్శన జరగటం లేదనే వాదన ఉన్నది.

శనివారం కాచిగూడలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్ కృష్ణయ్య. చిత్రంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్

బీసీలకు గడ్కరీ క్షమాపణ చెప్పాలి: కృష్ణయ్య

కాచిగూడ, డిసెంబర్ 23: కులగణన చేపడితే సమాజ విభజన జరుగుతుందని వ్యాఖ్యానించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దేశంలోని 70 కోట్ల మంది బీసీలకు క్షమాపణ చెప్పాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాచిగూడ అభినందన్ హోటల్‌లో శనివారం జరిగిన బీసీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటని, వెంటనే కులగణన చేపట్టాలని కోరారు.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కులాలవారీగా జనాభా లెక్కలు తేల్చి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి, విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లను 25 నుంచి 52 శాతానికి పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్చిన బీసీల హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీలం వెంకటేశ్, శ్రీనివాస్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య

పెరిగిన ఫారెక్స్ రిజర్వులు

ముంబై, డిసెంబర్ 23: విదేశీ మారకం నిల్వలు భారీగా పుంజుకున్నాయి. ఈ నెల 15తో ముగిసిన వారంతానికిగాను 9.112 బిలియన్ డాలర్లు పెరిగి 615.971 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు రిజర్వుబ్యాంక్ వెల్లడించింది. అంతక్రితంవారంలోనూ రిజర్వులు 2.816 బిలియన్ డాలర్లు ఎగబాకి 606.859 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. విదేశీ కరెన్సీ ఆస్తుల విలువ 8.349 బిలియన్ డాలర్లు పెరిగి 545.048 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గోల్డ్ రిజర్వులు 446 మిలియన్ డాలర్లు అధికమై 47.577 బిలియన్ డాలర్లకు చేరాయి.

52 వారాల గరిష్ఠానికి ఎల్ఐసీ షేరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)లో 25 శాతం కనీస పబ్లిక్ వాటాను పదేండ్లలోపు పెంచుకునే మినహాయింపును కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ మంజూరు చేయడంతో శుక్రవారం ఆ షేరు ఒక్కసారిగా పెద్ద ర్యాలీ జరిపింది. ఇంట్రాడేలో 6 శాతంపైగా పెరిగి 52 వారాల గరిష్ఠస్థాయి రూ.821 వద్దకు చేరింది. ట్రేడింగ్ ముగింపులో కొంతమేర లాభాల్ని కోల్పోయి చివరకు రూ.792 వద్ద నిలిచింది. ఎల్ఐసీ మలి పబ్లిక్ ఆఫర్ ఇప్పట్లో జారీకాదన్న అంచనాలు షేరు పెరుగుదలకు కారణమని విశ్లేషకులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ షేర్లను మరోదఫా విక్రయిస్తే, మార్కెట్లో ఫ్లోటింగ్ ఈక్విటీ పెరిగి షేరు వృద్ధికి అడ్డంకిగా మారుతుందన్న ఆందోళన ఇప్పటివరకూ ఇన్వెస్టర్లలో ఉందని, ఇప్పుడది తొలగిపోవడంతో తాజా ర్యాలీ జరిగిందని వారు వివరించారు.

ఎయిర్ ఇండియాలోకి బాహుబలి

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: ప్రముఖ విమాన యాన సంస్థ ఎయిర్ ఇండియా గుప్పిట్లోకి మరో విమాన సర్వీసు వచ్చి చేరింది. అతిపెద్ద బాడీ కలిగిన ఏ350-900 ఎయిర్‌క్రాఫ్ట్ శనివారం జత్తైంది. యూరప్‌కు చెందిన విమానాల తయారీ దిగ్గజం ఎయిర్‌బస్ తయారు చేసిన ఈ సర్వీసు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మధ్యాహ్నం దిగినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇలాంటి విమాన సర్వీసును నిర్వహిస్తున్న సంస్థ ఎయిర్ ఇండియా కావడం విశేషం. దీంతోపాటు వచ్చే మార్చి లోగా మరో ఐదు విమానాలు కూడా అందుబాటులోకి తీసుకురానున్నది. ఈ ఏడాది మొదట్లో ఎయిర్ ఇండియా.40 ఏ350 ఎస్ విమానాలు, 40 ఏ350-900, ఏ350-1000 ఎయిర్‌క్రాఫ్ట్‌లతోపాటు 140 చిన్న సైజు ఏ321, 70 ఏ320 నియో విమానాలకు ఆర్డర్ ఇచ్చిన విషయం తెలిసిందే.

ఎయిర్‌లైన్స్‌కు వెయ్యి కోట్లు ఆదా

భారతీయ వైమానిక దళం ఆధీనంలో ఉన్న గగనతలాన్ని వినియోగించుకోవడం వల్ల విమానయాన సంస్థలకు ఏటా వెయ్యి కోట్ల రూపాయల వరకు ఆదా కానున్నదని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశీయంగా వినియోగిస్తున్న గగనతలంలో 30 శాతం వైమానిక దళం ఆధీనంలో ఉన్నది. ఈ గగనతలాన్ని వినియోగించుకోవడం వల్ల విమానం నడిచే సమయం తగ్గనున్నదని, అలాగే చమురు వినిమయం, ఉద్గారాలు మరింత తగ్గనున్నాయని తెలిపింది. ఈ నెల 18 నాటికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) 1,562 మంది కమర్షియల్ పైలెట్లకు లైసెన్స్‌లు జారీ చేసింది. వైమానిక దళం వినియోగిస్తున్న ఏరోస్పేస్‌లో 40 శాతం వృథాగా ఉన్నదని పేర్కొంది. ఆగస్టు 2020 నుంచి ఇప్పటి వరకు రూ.640.7 కోట్ల ఖర్చులు తగ్గాయని, అలాగే 1.37 లక్షల టన్నుల ఉద్గారాలు తగ్గాయని వెల్లడించింది.

ఏపీలో సెంచూరీ ప్లాంట్

హైదరాబాద్, డిసెంబర్ 23: ఆంధ్రప్రదేశ్‌లో వెయ్యి కోట్ల రూపాయలతో వుడ్ ప్యానెల్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు సెంచూరీ ప్లేబోర్డ్స్ ప్రకటించింది. బద్వేల్ వద్ద ఏర్పాటుచేసిన ఈ ప్లాంట్‌ను ఏపీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంచూరీ ప్లే చైర్మన్ సజ్జన్ భజన్‌కా మాట్లాడుతూ..100 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ కోసం రెండు దశల్లో రూ.1,000 కోట్ల మేర పెట్టుబడి పెడుతున్నట్టు చెప్పారు. దీంతో వచ్చే ఐదేండ్లకాలంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తొలి దశలో ఎండీఎఫ్ ప్లాంట్ కోసం రూ.700 కోట్లు, పీవీసీ-లామినేట్స్ కోసం మరో రూ.250 కోట్ల నిధులు వెచ్చించినట్టు తెలిపారు.

ఇన్‌ఫర్టిలిటికీ బీమా

దేశంలోనే తొలిసారిగా తెచ్చిన ఇందిరా ఐవీఎఫ్, సేఫ్‌ట్రీ

హైదరాబాద్, డిసెంబర్ 23: దేశవ్యాప్తంగా సంతాన సాఫల్య చికిత్స దవాఖానల్ని నడుపుతున్న ఇందిరా ఐవీఎఫ్.. ఇన్సూర్‌టెక్ కంపెనీ సేఫ్‌ట్రీతో చేతులు కలిపింది. సంతానం లేక (ఇన్‌ఫర్టిలిటీ) ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న జంటలకు ఊరటనిచ్చేలా ఇరు సంస్థలు కలిసి తాజాగా ఓ ప్రత్యేక ఆరోగ్య బీమాను పరిచయం చేశాయి. దేశంలోనే ఈ రకమైన బీమా ఇదే మొదటిది కావడం విశేషం. ఇక ఈ ఇన్సూరెన్స్ ప్లాన్ కింద 35 ఏండ్లలోపు జంటలకు సమగ్ర రీతిలో 24 నెలల మద్దతు లభిస్తుంది. వైద్య, ఆహార, మానసిక సంబంధిత విషయాల్లో కన్సల్టేషన్స్ ఉంటాయి. ఐయూఐ, ఐవీఎఫ్‌ల్లో రెండేసి చొప్పున రౌండ్ల కవరేజీ దొరుకుతుంది. అండాల సేకరణ, లేజర్ టెక్నాలజీ ఆధారిత వైద్యం, బ్లాస్టోసిస్ట్ కల్చర్, పిండం బదిలీ, దాని నిలుపుదల వంటి వివిధ వైద్య సహాయాలు అందుకోవచ్చు. అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) యాక్ట్ 2021, సరోగసి (రెగ్యులేషన్) యాక్ట్ 2021లకు అనుగుణంగా అండ దాతలకు, సరోగేట్లకు కూడా ఈ కవరేజీని పొడిగించుకోవచ్చని సంస్థలు తెలిపాయి. కాగా, సంతాన లేమితో బాధపడుతున్న చాలామంది జంటలు నేడు దానికి సంబంధించిన చికిత్సల్ని తీసుకోవడానికి ఆర్థికంగా సతమతమవుతున్నాయని, అలాంటి వారందరి కోసమే ఈ బీమాను తెచ్చామని ఈ సందర్భంగా ఇందిరా ఐవీఎఫ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన, సంస్థ సీఈవో డాక్టర్ క్షితిజ్ ముద్గియా, సేఫ్‌ట్రీ ఇన్సూరెన్స్ సీఈవో వికాస్ ఆనంద్ తెలిపారు. భారత్‌లో 3.3-3.4 కోట్ల జంటలు సంతానపరమైన సమస్యల్ని ఎదుర్కొంటున్నట్టు డబ్ల్యూహెచ్‌వో చెప్తున్నది. వీరిలో కేవలం ఒక్క శాతం జంటలే సంతాన సాఫల్య చికిత్సల్ని తీసుకోగలుగుతున్నాయని, ఇందుకు వైద్యంపై అవగాహన లేకనో, ఆర్థిక ఇబ్బందులో కారణమవుతున్నాయని చెప్పారు. ఇంకా చెప్పాలంటే 90 శాతానికిపైగా జంటలు ఆర్థిక స్థోమత లేకనే సంతాన చికిత్సలకు దూరంగా ఉంటున్నాయని తేలినట్టు వివరించారు. అందుకే ఈ బీమాను తెస్తున్నట్టు స్పష్టం చేశారు.